క్లుప్తంగా

వేతనాలు పెంచాలి



పెద్దకొడప్‌గల్‌: ఐకేపీ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు వేతనాలు పెంచాలనే డిమాండ్‌తో వీవోఏలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఐకేపీ కార్యలయం ఎదుట చేపట్టిన ఆందోళనలో వీవోఏ మండల అధ్యక్షుడు ఉమాకాంత్‌ మాట్లాడుతూ 20 ఏళ్లుగా పని చేస్తున్నా జీతాలు పెంచడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏల మండల ఉపాధ్యక్షురాలు నిర్మల, కార్యదర్శి రఘుపతి, సంతోష్‌ గౌడ్‌, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ



పిట్లం: మండలంలోని కుర్తి గ్రామంలో సర్పంచ్‌ గడిల మైపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్‌ అశోక్‌ కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని సర్పంచ్‌ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్‌ నేతల చేరిక



దోమకొండ: బీజేవైఎం మండల అధ్యక్షుడు సార్ల రాజుతో పాటు మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆదివారం మాజీ మంత్రి షబ్బీర్‌ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు సీతరం మధు, రాములు, భిక్కనూరు మండల అధ్యక్షుడు భీంరెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్‌ పరీక్షల అక్రమాలపై విచారణ జరపాలి



కామారెడ్డి టౌన్‌: ఓపెన్‌ ఇంటర్‌, ఎస్సెస్సీ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం డిమాండ్‌ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు రాసినవిద్యార్థుల నుంచి రూ. కోటిన్నర వరకు వసూలు చేశారని, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్‌, అరవింద్‌రెడ్డి, రాజు, బస్వంత్‌, సంపత్‌, నాగేందర్‌ పాల్గొన్నారు.

బహుజన భరోసా సభకు తరలి వెళ్లిన నేతలు



ఎల్లారెడ్డి: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన బహుజన భరోసా సభకు ఎల్లారెడ్డి నుంచి బీఎస్పీ నాయకుడు బబ్లూతో పాటు పలువురు తరలివెళ్లారు.

మద్నూర్‌: బీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహుజన భరోసా సభకు మండలం నుంచి పలువురు బీఎస్పీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. బహుజన రాజ్యం స్థాపించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు పలువురు నాయకులు వెల్లడించారు.

వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

రుద్రూర్‌: ఈ ఏడాది పదో తరగతి చదివే విద్యార్థుల కోసం మాస్టర్స్‌ ట్యూషన్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టులపై బోధన్‌ పట్టణంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాస్టర్స్‌ ట్యూషన్‌ సెంటర్‌, ఓవర్సీస్‌ ఎడ్యుకేషన్‌ జోన్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ గోపీకృష్ణ తెలిపారు. రుద్రూర్‌ మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రుద్రూర్‌ సర్పంచ్‌ ఇందూర్‌ చంద్రశేఖర్‌, మేడంపూడి దత్తు వరప్రసాద్‌ సహకారంతో 30 రోజుల శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. బోధన్‌ బస్టాండ్‌ ఎదురుగా ఉన్న అప్నా కిరాణా స్టోర్‌ బిల్డింగ్‌పైన హాలులో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 5 నుంచి ప్రారంభమైందన్నా రు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులుంటాయని వివరించారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిధులు ఇవ్వరు.. అప్పులు తీరవు

- ఆందోళనలో సర్పంచులు
- ఆరు నెలలుగా ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు బంద్‌
- పత్తాలేని క్రీడా ప్రాంగణాల బిల్లులు



సింగరాయపల్లి పంచాయతీ కార్యాలయ భవనం

రామారెడ్డి: గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు ఆరు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేయడం లేదు. పంచాయతీకి సంబంధించిన విద్యుత్‌ బిల్లులు, మల్టీపర్పస్‌ వర్కర్లకు, చెత్త సేకరణ కోసం వినియోగించే ట్రాక్టర్‌ డీజిల్‌ బిల్లులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాల ఏర్పాటు కోసం సర్పంచ్‌లు సొంతంగా డబ్బులు ఖర్చు చేశారు. ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ఎస్‌ఎఫ్‌సీ నిధులను ఫ్రీజింగ్‌లో ఉంచారు. కేంద్రం ఇవ్వాల్సిన ఆర్థిక సంఘం నిధులు సైతం మంజూరు కాకపోవడంతో సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పంచాయతీకి కనీసం ప్రతి నెల రూ. 50 వేల వరకు ఖర్చు అవుతుంది. ఈ మొత్తాన్ని సైతం భరించలేక సర్పంచ్‌లు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు రామారెడ్డి మండలం స్కూల్‌ తండాను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ భవనంలో తాత్కాలికంగా పంచాయతీని ఏర్పాటు చేశారు. ఈ పంచాయతీకి ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం కింద ప్రతి నెల రూ. 70 వేలు నిధులు మంజూరయ్యేవి. వీటిలో ట్రాక్టర్‌ కిస్తీ కోసం రూ.15 వేలు, కరెంట్‌ బిల్లు రూ.15 వేలు, డీజిల్‌ ఖర్చు రూ.10 వేలు, మల్టీపర్పస్‌ వర్కర్‌కు రూ. 8,500 ప్రకారం నెలకు రూ.48,500 ఖర్చు అయ్యేవి. ఇక నీటి సరఫరా కోసం అయ్యే ఖర్చు అదనం. రెండు మూడు నెలలకైనా నిధులు మంజూరు కాకపోతాయా అని సర్పంచ్‌లు సొంతంగా డబ్బులు ఖర్చు చేశారు. ఆరు నెలలుగా పంచాయతీకి రావాల్సిన డబ్బులు నిలిపివేయడంతో ఏమి చేయాలో దిక్కు తెలియక సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు పది రోజులుగా ఆందోళన బాట పట్టడంతో పంచాయతీల్లో చిన్న చిన్న సమస్యలు కూడా తీర్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌, ట్రాలీ, ట్యాంకర్‌, మల్టీపర్పస్‌ వర్కర్లను నియమించుకోవాలని వీటికయ్యే ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని సర్పంచ్‌లకు గతంలో హామీ ఇచ్చినా ఇప్పటికీ అతీగతీలేకుండా పోయింది. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలున్నాయి. ట్రాక్టర్‌ కొనుగోలుకు సర్పంచులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నా రు. రుణాలు నెల నెల బ్యాంకు చెల్లించేందుకు పంచాయతీల్లో నిధులు లేకపోవడం సర్పంచులకు తలనొప్పిగా మారింది. డీజిల్‌ ఖర్చులు, సఫాయి కార్మికుల వేతనాలు, ట్రాక్టర్‌ డ్రైవర్‌ జీతం, కరెంటు బిల్లులు, కారోబార్ల వేతనాలు పంచాయతీలకు భారంగా మారింది. పల్లె ప్రగతి పేరుతో ఏటా సర్పంచులపై భారం మోపుతూ సొంత డబ్బులతో రోడ్లు, డ్రైనేజీ, మన ఊరు మనబడి పనులను చేయించారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలంటూ హడావుడి చేసిన ప్రభుత్వం వాటికి మాత్రం బిల్లులు ఇవ్వలేదు. దీంతో సర్పంచ్‌లు అప్పుల ఊబిలో కూరుకుపోయి కొట్టుమిట్టాడుతున్నారు.

గత ప్రభుత్వాలు ఇలా చేయలేదు



జనరల్‌ ఫండ్‌, ఎస్‌ఎఫ్‌సీ నిధులపై గత ప్రభుత్వాలు ఫ్రీజింగ్‌ విధించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవడం హక్కు. ఆ హక్కును కూడా సీఎం కేసీఆర్‌ నిధులు ఇవ్వకుండా ఫ్రీజింగ్‌ చేయడం అన్యాయం.

–గీరెడ్డి మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌, పోసానిపేట

ప్రజల వద్దకు వెళ్లలేకపోతున్నాం



నిధులు రాక పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితి. ప్రజలు ఏమి అడుగుతారోనని వారి వద్దకు ధైర్యంగా వెళ్లలేకపోతున్నాం. ఎస్‌ఎఫ్‌సీ నిధులున్నా ఫ్రీజింగ్‌లో ఉంచడం సరైన చర్య కాదు.

–అధికం మహేశ్వరి, సర్పంచ్‌, సింగరాయపల్లి

కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలి



గుర్గుల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌

కామారెడ్డి రూరల్‌: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధ పొందాలని అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌ రైతులకు సూచించారు. మండలంలోని గర్గుల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించి అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌ అభిషేక్‌ సింగ్‌ తదితరులు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్‌: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి రైతులకు సూచించారు. అంజనీ, పోచారం గ్రామాల్లో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌ హన్మంత్‌ రెడ్డి, సర్పంచ్‌ పండరినాథ్‌, మధన్‌, తదితరులు పాల్గొన్నారు.



బోరు తవ్వించడం అభినందనీయం



పెరుమాండ్ల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోరింగు

భిక్కనూరు: హైదరాబాద్‌ క్రైమ్‌ బ్రాంచ్‌లో ఎస్సైగా పనిచేస్తున్న భిక్కనూరుకు చెందిన గడ్డం మల్లేశ్‌కు తన సొంత ఊరిపై మమకారం చూపడం అభినందనీయం అని సర్పంచ్‌ తున్కి వేణు అన్నారు. ఆదివారం భిక్కనూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న లోంక పెరుమాండ్ల ఆలయం వద్ద గడ్డం మల్లేశ్‌ రూ. 1.50 లక్షలు ఖర్చు చేసి బోరింగు తవ్వించారు. అంతేకాకుండా ఆయన ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తుంటారు. కార్యక్రమంలో క్రైమ్‌ బ్రాంచ్‌ ఎస్సై గడ్డం మల్లేశ్‌, నేతలు సరస్వతి ప్రభాకర్‌, పరుశరామ్‌ తదితరులు పాల్గొన్నారు.

పాతరాజంపేటలో బోరుమోటారు..

కామారెడ్డి అర్బన్‌: పట్టణంలోని పాతరాజంపేటలో ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ నిధులతో తవ్వించిన బోరు మోటారును కౌన్సిలర్‌ ఆకుల రూప ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సరంపల్లి పాల సంఘం అధ్యక్షుడు ఆకుల రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల కబ్జా

- బీఆర్‌ఎస్‌ నేతలు ఉండటంతో పట్టించుకోని రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రాజంపేట: మండల కేంద్రంలోని విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురౌతున్నాయి. బీఆర్‌ఎస్‌ నాయకులు విలువైన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. మండల కేంద్రంలోని సర్వే నంబరు 576లో 501 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో గత ప్రభుత్వాలు 200 మందికి పట్టాలు పంపిణీ చేసినా స్థలం మాత్రం చూపించలేదు. రాజంపేట మండల కేంద్రం అయినప్పటి నుంచి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో బీఆర్‌ఎస్‌ నాయకుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. దీంతో తమ కుటుంబ సభ్యులు, బీనామి పేర్లతో ప్రభుత్వ భూములను రికార్డుల్లో ఎక్కించుకున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో ఎవరూ భూమి చదును చేయరాదని బోర్డు ఏర్పాటు చేశారేతప్ప భూముల ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పట్టా పొందిన రైతులు మాత్రం తమకు కేటాయించిన భూమి ఎక్కడుందో సర్వే చేసి అప్పగించాలని రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. సర్వే చేసి పట్టాలిచ్చిన భూమిని తమకు అప్పగించాలని రాజంపేటకు చెందిన బత్తుల లావణ్య అధికారులను, పాలకులను విజ్ఞప్తి చేశారు.

రాత్రివేళ సైతం వరి కోతలు



నాగిరెడ్డిపేట: అకాల వర్షాలకు తోడు, వరి కోత యంత్రాల కొరత ఉండడంతో మండలంలోని వివిధ గ్రామాలలో రాత్రింబవళ్లు వరి కోత పనులు జోరుగా సాగుతున్నాయి. వర్షాల వల్ల పంట కోత పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షం కురిస్తే పంటకు నష్టం జరుగుతుందోననే ఆందోళనతో రైతులు పగలనకా, రాత్రనకా పంటకోతలు చేపడుతున్నారు.

కాలుష్యం వెలువడుతున్నా పట్టించుకోరా?



కాచాపూర్‌లో దీక్ష చేస్తున్న స్థానికులు

భిక్కనూరు: ఎంఎస్‌ఎన్‌ కెమికల్‌ ఫ్యాక్టరీ నుంచి కాలుష్యం వెలువడుతూ ప్రజల ప్రాణాలకు ఇబ్బందులకు గురి చేస్తున్నా పట్టించుకోరా అంటూ కాచాపూర్‌ గ్రామానికి చెందిన వారు అధికారులపై మండిపడ్డారు. ఫ్యాక్టరీని మూసేయాలని డిమాండ్‌ చేస్తూ చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. స్థానికులు చేపట్టిన దీక్షకు మండలంలోని ఇతర గ్రామాలకు చెందిన వారు తరలివచ్చి వారికి మద్దతు ప్రకటించారు.

బీజేపీ నేతలకు ప్రతీదీ రాజకీయమేనా?



భిక్కనూరులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నేతలు



కామారెడ్డిలో..

భిక్కనూరు: సమస్యను సృష్టించి ప్రతిదాన్ని రాజకీయం చేయడం బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి నైజమని బీఆర్‌ఎస్‌ నేతలు విమర్శించారు. ఆదివారం ఆత్మకమిటీ చైర్మన్‌ నర్సింహారెడ్డి, ఎంపీపీ గాలిరెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ భగవంత్‌రెడ్డి, సర్పంచ్‌ తున్కి వేణు మాట్లాడుతూ ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ రైతులకు అండగా అందుకు విరుద్ధంగా వెంకటరమణారెడ్డి వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉన్నప్పటికీ బస్వాపూర్‌లోని రైస్‌మిల్‌ సిబ్బంది రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం గంప గోవర్ధన్‌ దృష్టికి రావడంతో ఆయన అక్కడికి వెళ్లి రైస్‌మిల్‌ సిబ్బందిని నిలదీయడం తప్పు ఎలా అవుతందని ప్రశ్నించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్లు కిష్టగౌడ్‌, సిద్ధరాములు, శ్రీసిద్ధరామేశ్వరాలయం పునర్‌ నిర్మాణకమిటీ చైర్మన్‌ అందే మహేందర్‌రెడ్డి, విండో చైర్మన్‌లు గంగళ్ల భూమయ్య, రాజాగౌడ్‌, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్‌ ద్యావర సాయిరెడ్డి, మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

కామారెడ్డి టౌన్‌: ప్రభుత్వ విప్‌ గంపగోవర్ధన్‌పై బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సింగిల్‌ విండో చైర్మన్‌ నల్లవెల్లి అశోక్‌ అన్నారు. ఆదివారం కామారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల పక్షాన ప్రభుత్వ విప్‌ నిలబడి ధాన్యం తీసుకోవాలని రైస్‌మిల్లర్లను డిమాండ్‌ చేయడం తప్పా అని ప్రశ్నించారు.

మిల్లర్లు సహకరించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్‌

దోమకొండ: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురిచేయొద్దని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్‌, సింగిల్‌విండో చైర్మన్‌ పన్యాల నాగరాజ్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక రైతువేదిక వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయడం లేదన్నారు. ధాన్యం తరలించేందుకు లారీలు రావడం లేదని మాజీ మంత్రి షబ్బీర్‌ అలీ పేర్కొనడం అబద్ధం అన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు నిమ్మశంకర్‌, కడారి రమేష్‌, ఉప సర్పంచ్‌ గజవాడ శ్రీకాంత్‌, మండల కోఆప్షన్‌ సభ్యుడు షమ్మీ, నాయకులు నల్లపు శ్రీను, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి నీలం రమేష్‌

కామారెడ్డి టౌన్‌: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి నీలం రమేష్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సీఎం, ఎమ్మెల్యేలు, మంత్రులు తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పడం కాదని, దగ్గరుండి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేలు పరిహారం చెల్లించాలన్నారు. రాజన్న సంక్షేమ పాలన రావాలంటే రాష్ట్రానికి వైఎస్సార్‌ కూతురు షర్మిల నాయకత్వం అవసరం అన్నారు.

కార్యవర్గం..

■ కాంగ్రెస్‌ ఓబీసీ పట్టణ అధ్యక్షుడి నియామకం



కామారెడ్డి టౌన్‌: కాంగ్రెస్‌ ఓబీసీ పట్టణ అధ్యక్షుడిగా కడెం ప్రవీణ్‌ను నియమించారు. మాజీ మంత్రి షబ్బీర్‌ అలీ ఆదివారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ,అధ్యక్షుడు కైలాస్‌ శ్రీనివాస్‌రావు, పీసీసీ డెలిగేట్‌ బద్దం ఇంద్రకరణ్‌ రెడ్డి, నాయకులు పండ్ల రాజు, ఐరేని సందీప్‌, చందు, గోనె శ్రీనివాస్‌, కారంగుల అశోక్‌ రెడ్డి, శ్రీధర్‌, ప్రవీణ్‌ రెడ్డి పాల్గొన్నారు.

■ ఏఐకేఎంఎస్‌ కార్యవర్గం ఏర్పాటు

మాచారెడ్డి: ఏఐకేఎంఎస్‌ మండల శాఖ కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు భూమయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ ఆలీ, ఉపాధ్యక్షుడిగా కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్‌ ఆలీ, సహాయ కార్యదర్శిగా నర్సింలు, కోశాధికారిగా ఎండీ మౌలానా, సభ్యులుగా రమేష్‌, బాల్‌ నర్సయ్య, రాజు, బాలకిషన్‌, లింగం ఎన్నికయ్యారు.

ఆధ్యాత్మికం

■ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



మద్నూర్‌: మండల కేంద్రమైన మద్నూర్‌ సాయిబాబా ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు.

■ దయానంద ఆశయాలను వ్యాప్తి చేయాలి



కామారెడ్డి అర్బన్‌: ఆర్యసమాజ స్థాపకులు స్వామి దయానంద సరస్వతి ఆశయాలను సమాజంలో వ్యాప్తి చేసేందుకు ఏర్పాటు చేస్తున్న శిబిరాలకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆర్యసమాజ్‌ ప్రముఖ్‌ జ్యోతిశ్రీ ఆచార్య అన్నారు. స్థానిక ఆర్యనగర్‌ ఆర్య సమాజ్‌లో 3న ప్రారంభమైన వైదిక కార్యకర్తల నిర్మాణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో యోగాచార్యులు గరపల్లి అంజయ్య, అర్వపల్లి రమేష్‌, గుండా హరినాథ్‌, ఆర్యసమాజ్‌ అధ్యక్షుడు కిషన్‌, ఆచార్య సత్యమిత్ర, పి.శ్రీనివాస్‌, దోమకొండ అరుణ, గుండ కృష్ణవేణి పాల్గొన్నారు.

■ శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి: తాడ్వాయి శబరి మాత ఆశ్రమంలో ప్రతిమను, దివ్య సమాధిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

■ పోచమ్మకు బోనాలు



లింగంపేట: మండలంలోని అయిలాపూర్‌లో ఇంటికి ఒకరు చొప్పున బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు సమర్పించారు. ఈ ఏడాది పంటలు సంవృద్ధిగా పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పోచయ్య, రాములు, గంగరాజం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

■ ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కామారెడ్డి రూరల్‌ : మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కామారెడ్డి నియోజకవర్గం ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, సర్పంచ్‌ ఆనందరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండూరు కృష్ణమూర్తి, కోశాధికారిగా కొండూరు వీరేశం, సభ్యులు నారాగౌడ్‌, రవీందర్‌ రెడ్డి, బెజగం సంతోష్‌, కొండూరు శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

■ ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

నిజాంసాగర్‌: మండలంలోని అచ్చంపేట గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒడిబియ్యంతో పాటు పసుపు కుంకుమను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ అనుసూయ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఆలయ పునరుద్ధరణకు విరాళాలు

కామారెడ్డి అర్బన్‌: కామారెడ్డి శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునరుద్ధరణ కోసం భక్తులు పల్సర్‌ సతీష్‌ రూ. 51 వేలు, కౌన్సిలర్‌ వేణు రూ.21 వేలు, ఒడ్డెం భాస్కర్‌ రూ.5,589 విరాళం ఇచ్చారు.

నేడు లింగంపేట, బస్వన్నపల్లిలో రక్తదాన శిబిరాలు

కామారెడ్డి అర్బన్‌: రెడ్‌క్రాస్‌ సొసైటీ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్‌ జయంతి, ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ దినోత్సవం సందర్భంగా సోమవారం లింగంపేట, రాజంపేట మండలం బస్వన్నపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చైర్మన్‌ ఎం.రాజన్న తెలిపారు.

బాన్సువాడలో..

బాన్సువాడ రూరల్‌: బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని రెడ్‌క్రాస్‌ సొసైటీ బాన్సువాడ డివిజన్‌ అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్‌ రెడ్డి కోరారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. రక్తదాన శిబిరాన్ని స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శిస్తారని తెలిపారు.

అమరుడైన కానిస్టేబుల్‌ కుమార్తె డాక్టర్‌ కావడం అభినందనీయం

రాజంపేట: తెలంగాణ మలి దశలో ఆత్మ బలిదానం చేసుకున్న మండలంలోని శివాయిపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్‌ కిష్టయ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండటం పట్ల సర్పంచ్‌ విఠల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కిష్టయ్య కుమార్తె ప్రియాంకను కరీంనగర్‌లో మెడికల్‌ చదివించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ విఠల్‌ రెడ్డి సీఎం కేసిఆర్‌కు, ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సమావేశం

భిక్కనూరు: దక్షిణకాశీగా పేరొందిన భిక్కనూరు శ్రీ సిద్ధరామేశ్వరాయలంలో చేపట్టాల్సిన పూజా కార్యక్రమాలు, పునర్‌ నిర్మాణ పనులకు సంబంధించి చర్చించేందుకు సోమవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్‌ తున్కి వేణు, ఆలయ పునర్‌ నిర్మాణ కమిటీ చైర్మన్‌ అందే మహేందర్‌రెడ్డి తెలిపారు.

నేడు కుస్తీపోటీలు

లింగంపేట: మండలంలోని అయిలాపూర్‌ దుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం టెంకాయ కుస్తీ నుంచి వెండి కడెం కుస్తీ వరకు పోటీలు నిర్వహిస్తామని సర్పంచ్‌ ధనలక్ష్మి తెలిపారు. స్థానికులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఏఈ గజానంద్‌

బాన్సువాడ రూరల్‌: పంట కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని నీటిపారుదల శాఖ ఏఈ గజానంద్‌ కాంట్రాక్టర్‌కు సూచించారు. మండలంలోని నాగారం గ్రామంలో ఎస్‌డీఎఫ్‌ నిధులతో చేపడుతున్న కాలువ పనులను ఆదివారం ఆయన సర్పంచ్‌ రాచప్పతో కలిసి పరిశీలించారు. పనులు పూర్తయితే చివరి ఆయకట్టు వరకు సాగునీరు సులువుగా వెళ్లే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.